క్లుప్తంగా

రోడ్లపై తోపుడుబండ్లు వద్దు



బండ్లను తీయిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

సాక్షి స్పందన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై ఈనెల 24న సోమవారం సాక్షిలో 'ట్రాఫికర్ తీరేదెన్నో డో..'అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఎస్పీ రాజేశ్‌మీనా ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్‌చౌక్ ప్రాంతంలో ఉన్న తోపుడుబండ్లను తొలగింపజేశారు. రోడ్లపై ఆటోలు, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లను నిలిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నీటి కోసం ధర్నా



మాట్లాడుతున్న ఎంపీవో మోహన్‌సింగ్

కుభీర్: మండలకేంద్రంలోని చాకలిగల్లీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట కాలనీవాసులు ధర్నా చేశారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ వచ్చి వారితో మాట్లాడారు. ట్యాంకర్లతో నీళ్లను సరఫరా చేస్తామని అధికారులు పేర్కొనగా బోర్లు వేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. అధికారులు అంగీకరించడంతో ధర్నా విరమించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఎ.దత్తాత్రి, నేతలు బి.శేఖర్, మ్యాకల రాజు, భూషణ్ తదితరులు ఉన్నారు.

26న ఇసుక వేలం

తానూరు: మండలంలో పోలీసుల తనిఖీలో పట్టుబడిన ట్రాక్టర్, టిప్పర్ల ఇసుక నిల్వలకు ఈనెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లింగం మూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన వారు వేలంలో పాల్గొనాలని.. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌గా కమల్‌దాస్



కుంటాల: కుంటాల తహసీల్దార్‌గా కమల్ దాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేసి పదోన్నతిపై కుంటాల వచ్చారు. ఇక్కడ పని చేసిన అహ్మద్‌ఖాన్ బదిలీపై దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా వెళ్లారు. వారిని సిబ్బంది సన్మానించారు. డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్ ఉన్నారు.

వైద్యపరీక్షలు చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కడెం: విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బంది ఆరు నెలలకోసారి విధిగా వైద్యపరీక్షలు చేసుకోవాలని ఎఫ్ఆర్వో గీతారాణి సూచించారు. మండలకేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖానాపూర్‌కు చెందిన డాక్టర్లు సాయికేతన్‌రెడ్డి, నాగరాజు వచ్చి అటవీ అధికారులు, సిబ్బందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి మందులు అందించారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రామారావు ఆదేశించారు. లోకేశ్వరం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త లింబాద్రి, చీఫ్ సూపరింటెండెంట్ రాజేశ్వరం, నర్సింహాచార్యులు, డీవో భోజన్న, చంద్రనాగకాంత్ ఉన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్సకోలా రాంజీ గోండు 167వ వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో రఘు, సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు మాట్లాడుతూ రాంజీగోండు పోరాటాన్ని భావితరాలకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాంజీ గోండు వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు సోయం సూర్యభాను, ఉయ్యాక భీంరావ్, ఆత్రం అర్జున్, గణేశ్ పాల్గొన్నారు.



రోడ్డుపై ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారుడు

- అధ్వానంగా దొనెల్లితండా – దత్తనగర్ రోడ్డు
- టెండర్ ప్రక్రియలో జాప్యం
- నరకయాతన పడుతున్న ప్రయాణికులు

నిధులు మంజూరైనా.. పనులు చేపట్టరా?

కుంటాల: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా మారింది మండలంలోని దొనెల్లితండా నుంచి మహారాష్ట్రలోని దత్తనగర్ వెళ్లే రోడ్డు దుస్థితి. ఈ మార్గంలో మూడున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి మెంటెనెన్స్ రూరల్ రోడ్స్ (ఎంఆర్ఆర్) కింద నిధులు రూ.కోటి 90 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరై రెండు నెలలు దాటినా సంబంధిత శాఖ అధికారులు టెండర్ ప్రక్రియ నిర్వహించడం లేదు. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి టెండర్ ప్రక్రియ నిర్వహించి పనులు వెంటనే ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలే..

గతంలో రోజ్‌గార్ నిధులు రూ.కోటి 25 లక్షలతో కుంటాల నుంచి దొనెల్లి మీదుగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర నిర్మించిన తారురోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలమయంగా మారింది. కుంటాల నుంచి వివిధ పనుల నిమిత్తం మహారాష్ట్రలోని శివుని, అప్పారావుపేట్, మహోర్, కిన్వట్ నాందేడ్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. ప్రస్తుతం గుంతలమయంగా మారిన దొనెల్లితండా– మహారాష్ట్ర సరిహద్దు వరకు (మూడు కిలోమీటర్ల దూరానికి) ఎక్కువ సమయం పట్టడంతోపాటు తరచుగా వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ఒక్కోసారి అదుపుతప్పి వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. భైంసా నుంచి కుంటాల మీదుగా మహారాష్ట్రలోని అప్పారావుపేట్ వరకు మూడు ట్రిప్పులు బస్సులను నడుపుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే లోకేశ్వరం, భైంసా, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల ప్రజలకు మహారాష్ట్ర వెళ్లేందుకు ప్రయాణం సులువుగా మారుతోంది.

వాహనాలు మొరాయిస్తున్నాయి



కుంటాల నుంచి మహారాష్ట్రలోని శివుని, అప్పారావుపేట్ ప్రాంతాలకు ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్తాను. ఈ రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనాలు మొరాయిస్తున్నాయి. రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– ఆనంద్‌రావు, ఆటోడ్రైవర్, కుంటాల

పనులు ప్రారంభించాలి



మహారాష్ట్ర వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఏయే ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తుంది. అధికారులు త్వరగా పనులు ప్రారంభించాలి.

– వసంత్, మహదేవ్‌నగర్ తండా

త్వరలో టెండర్ ప్రక్రియ

దొనెల్లితండా నుంచి సరిహద్దు ప్రాంతం వరకు రోడ్డు దెబ్బతినడంతో ప్రభుత్వం ఇటీవల నిధులను మంజూరు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. ఆ వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తాం.

– గౌరీశ్, పీఆర్ ఏఈ



అపూర్వ సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం నిర్మల్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అప్పటి గురువులు సురేశ్, నిర్మల, రమేశ్, వినోద, రఘోత్తంరెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షం

కడెం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి కల్లెడ గ్రామంలో 50 ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలవాలింది. పంట చేతికందే సమయానికి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి అదుకోవాలని వేడుకుంటున్నారు.



కల్లెడలో నేలవాలిన మొక్కజొన్న

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సారంగపూర్: గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో మహాలక్ష్మీ ఆలయం వరకు రూ.10లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయనను వీడీసీ సభ్యులు కోర్వ రాజేందర్, అజీజ్, మహేందర్, పోతన్న సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, నవీన్‌రెడ్డి, రాజు, రాములు, రాజు, పవన్, మహేందర్, లింగారెడ్డి, పోతారెడ్డి, భోజన్న, తదితరులు ఉన్నారు.

క్షయ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి

భైంసాటౌన్: రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం వంటి క్షయ (టీబీ) వ్యాధి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని యూపీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జబీన్ అన్నారు. పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్య సిబ్బంది శేషకుమార్, కిషన్, గంగన్న, కె గంగాధర్, తదితరులున్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ క్షయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు రాహుల్, మల్లికార్జున్, వెంకట్‌సాయి సువర్దన్‌లో రాబర్ట్ కోచ్ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ లాలయ్య, హెడ్‌నర్సు పద్మ, కల్పనా, ప్రేమలత, స్టాఫ్‌నర్సులు, భూలక్ష్మీ, పద్మ, ఏఎన్ఎంలు భీంబాయి, అరుణ, ఆరోగ్యమిత్ర గోపి, ఫార్మసిస్టు ప్రత్యూష పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు

రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్
- జై బాపు–జై భీమ్– జై సంవిధాన్ సన్నాహక కార్యక్రమం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జై బాపు– జై భీమ్–జై సంవిధాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్ అన్నారు. జై బాపు– జైభీమ్–జై సంవిధాన్ కార్యక్రమంపై నిర్మల్‌లోని మారుతి ఇన్ హోటల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు సోమవారం అవగాహన సదస్సు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అధ్యక్షతన నిర్వహించారు. నిర్మల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ అఫ్సర్ యూసుఫ్‌జాహి, ఖానాపూర్, ముధోల్ కోఆర్డినేటర్లు రాంభూపాల్, రుద్ర భాస్కర్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ హాజరై కాంగ్రెస్ నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు చేపడుతున్న కుట్రను గ్రామగ్రామాన తిరుగుతూ వివరించేందుకే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్లు సోమ భీమ్‌రెడ్డి, ఆనంద్‌రావు పాటిల్, అబ్దుల్ హాది, పడిగెల భూషణ్, ఆలయ కమిటీ చైర్మన్ గంగోని బూరజ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన, మహిళా, సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్

మహిళా రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నర్సాపూర్(జి): మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ప్రభుత్వం అందజేయనున్నట్లు ఏవో రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని మహిళా రైతులు ఈ కింద పేర్కొన్న పరికరాల యూనిట్ల కోసం వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్–6 కాగా జనరల్–4, ఎస్సీ–1, ఎస్టీ–1, పవర్ స్ప్రేయర్–4 కాగా జనరల్ విభాగంలో 2, ఎస్సీ–1, ఎస్టీ–1, రోటవేటర్లు–4 కాగా జనరల్ విభాగంలో 2, ఎస్సీ–1, ఎస్టీ–1, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్–1 జనరల్ విభాగంలో, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్–4 కాగా జనరల్ విభాగంలో 2, ఎస్సీ–1, ఎస్టీ–1 కేటగిరీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మహిళా రైతు డ్వాక్రా గ్రూప్‌లో సభ్యత్వం కలిగి ఉండాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండ



నగదు అందిస్తున్న సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన ద్యావత్ సురేశ్ ఇటీవల గుండెపోటుతో మరణించగా.. సోమవారం బాధిత కుటుంబానికి ఇదే మండలంలోని పంచగుడి హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు, వీడీసీ సభ్యులు రూ.30,100లను ఆర్థికసాయంగా అందించి అండగా నిలిచారు. హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు రూ.24100, వీడీసీ సభ్యులు రూ.ఆరు వేలను సురేశ్ భార్య ఉజ్వలకు అందజేశారు. గంజాల గంగాధర్, యోగేశ్, పీరుపటేల్, శంకర్‌పటేల్, వై.గంగాధర్, ప్రతాప్‌రెడ్డి, భోజప్ప పటేల్, ఆనంద్‌రావు, ఇంద్రకరణ్‌గౌడ్ ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

కుభీర్: మండలంలోని సొనారితోపాటు అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని నిర్మల్ సూపరిటెండెంట్ ఇంజినీర్ సుదర్శన్, ఏఈ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. తమ గ్రామానికి విద్యుత్ సరఫరాలో అన్యాయం జరుగుతుందని ఆదివారం సొనారి గ్రామస్తులు ఊరిలో ఉన్న సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే సొనారి పక్కనున్న మాలేగాంలో సబ్‌స్టేషన్ ప్రారంభమవుతుందని.. దీంతో సొనారిపై లోడ్ తగ్గిపోతుందని పేర్కొన్నారు.

టేలా తొలగింపు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ సమీరుద్దీన్ సీసీ రోడ్డుపై అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన రేకుల టేలాను అధికారులు తొలగించారు. టేలా తొలగించాలని పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేసినా ఆయన స్పందించలేదు. దీంతో సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు పోలీస్ భద్రత నడుమ పొక్లెయిన్ సాయంతో రేకుల టేలాను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

ఆదాయపు పన్ను వివరాలకు సంప్రదించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పెన్షనర్లు 2024–25 ఆర్థిక సంవత్సరపు ఇన్‌కం ట్యాక్స్(ఆదాయపు పన్ను)కు సంబంధించిన వివరాల కోసం పెన్షనర్ సంఘ భవనంలో సంప్రదించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోశాధికారి కార్యాలయం నుంచి తీసుకొచ్చిన జాబితా(లిస్టు) పెన్షనర్ సంఘ భవనంలో ఉంచినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సంప్రదించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

భూమిపూజ

సారంగపూర్: మండలంలోని వంజర్ నుంచి యాకర్‌పెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో రూ.30లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, మహాలక్ష్మీ అలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆత్మ మాజీ డైరెక్టర్ మహేశ్ యాదవ్, కొరిపెల్లి రాజు, లక్ష్మారెడ్డి, గంగన్న, సుమన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పనులు ప్రారంభం

బాసర: మండలంలోని కిర్గుల్ (బి) గ్రామంలో ఉపాధి నిధులు రూ.10లక్షలతో చేపట్టే వెయ్యి మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం బీజేపీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ సాయిబాబా, బీజేపీ మండల కన్వీనర్ నరేశ్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు గోవర్ధన్ సాయిలు, దశరథ్ రత్నాకర్, శేషన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

సారంగపూర్: మండలకేంద్రంలోని ఊరగుట్టపై నివాసం ఉంటున్న ప్రజలు తమకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం గుడిసెల్లో ఉంటున్న తమకు అర్హత పత్రాలు అందించిందన్నారు. ఇప్పటి వరకు తాగునీరు, రోడ్లు నిర్మించకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అహ్మద్, శ్యామ్‌రావు, రాజు తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. యజ్ఞాచారి చక్రపాణి నర్సింహమూర్తి, పండితులు నాగరాజుశర్మ, శరత్ చంద్రశర్మ ఆధ్వర్యంలో శాంతిహోమం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ, నాయీ బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పట్టాభిషేక మహోత్సవం

సోన్: మండలంలోని సాకెర వాసవి కన్యకా పరమేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి వైశ్య కుల గురువు పరమపూజ వామనాశ్రమ మహా స్వామీజీ 21వ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆమెడి కిషన్ తెలిపారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో వెళ్లి పూలు చల్లుతూ స్వామీజీకి స్వాగతం పలికారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టెలి ప్రజావాణిలో ఫిర్యాదు

ముధోల్: ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్షలు నిర్వహించాలని మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న టెలిఫోన్ ప్రజావాణిలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులు ఉన్నప్పటికీ శవపరీక్షల కోసం ముధోల్ గ్రామస్తులు భైంసా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ముధోల్, బాసర, తానూరు మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ త్వరలో ఆసుపత్రిలో శవ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు పోతన్న వివరించారు.

27న వారసంత వేలం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో 2025–26 సంవత్సరంలో వారసంత నిర్వహణకు గురువారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.10వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

కుంటాల: ఎల్ఆర్ఎస్ కింద ఈనెల 31లోగా ప్లాట్లనుక్రమబద్ధీకరించుకోవాలని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దొనెల్లి పంచాయతీ పరిధిలోని దొనెల్లి తండాలో గ్రామస్తులకు ఎల్ఆర్ఎస్ రాయితీపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు సాయేందర్, రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో ఇఫ్తార్‌విందు

నర్సాపూర్(జి): రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం మండలంలోని రాంపూర్‌లో సోమవారం బీజేపీ నాయకుడు జంగోళ్ల మహిపాల్ ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. మత పెద్దలతో ప్రార్థనల అనంతరం ముస్లింలు ఉపవాస దీక్షను విరమింపజేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటిన కండక్టర్

మామడ: బస్సులో సెల్‌ఫోన్ మర్చిపోయిన ప్రయాణికుడికి తిరిగి అందించి నిజాయతీ చాటుకున్నాడు బస్సు కండక్టర్. సోమవారం నిర్మల్ నుంచి కమల్‌కోట్ వెళ్లే బస్సులో ఆదర్శనగర్‌కు చెందిన కుర్మ చిన్నయ్య ప్రయాణించాడు. కమల్‌కోట్ వద్ద బస్సు దిగిన కొద్దిసేపటికి తన ఫోన్‌ను చూసుకున్నాడు. కన్పించకపోవడంతో తన నంబర్‌కు కాల్ చేయగా బస్సులో ఉన్నట్లు కండక్టర్ తెలిపారు. పొన్కల్ వద్ద బస్సు ఆపి డ్రైవర్ బాబురావు, కండక్టర్ రామరాజ్ నుంచి తన ఫోన్‌ను తీసుకున్నాడు. బస్సులోని ప్రయాణికులు వీరిని అభినందించారు.

కవితలకు ఆహ్వానం

భైంసాటౌన్: ఉగాది పండగ సందర్భంగా కవితలు ఆహ్వానిస్తున్నట్లు శ్రీ హంసవాహిని సాహిత్య కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుండ్లిక్ రావు, శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కల్గిన కవులు తమ కవితలను ఈనెల 28లోగా చిమ్నీ ప్రక్రియలో 16 వరుసలకు మించకుండా పంపాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99083 76796 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'సర్వే డబ్బులు చెల్లించాలి'

కుంటాల: కులగణన సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లకు డబ్బులు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటి గంగాదాస్, ఎల్మల ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. వ్యయప్రయాసాలకోర్చి సర్వే సమర్థవంతంగా నిర్వహించినా ఇప్పటికీ డబ్బులు పంపిణీ చేయలేదని వాపోయారు.

కాలనీ కమిటీ ఎన్నిక

మామడ: జిల్లాకేంద్రంలోని గాయిత్రి టౌన్‌షిప్ కాలనీ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. కమిటీలోని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోస్టులకు ఎన్నిక నిర్వహించగా.. మిగతా పోస్టులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కాలనీ అధ్యక్షుడిగా వై.వి.రమణరావు, ప్రధాన కార్యదర్శిగా డా.కె.కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా వై.గోపాల్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.భూమ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, భిక్షపతినాయక్, సంయుక్త కార్యదర్శులుగా టి.గజేందర్‌సింగ్, గోలి సాయన్న, ఈసీ సభ్యులుగా కె.రాజేందర్‌రెడ్డి, కె.రఘునాథ్, ఎస్.మహేశ్, ఎం.శాంతారాం, జె.పోశెట్టి, సీహెచ్ మల్లిఖార్జున్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా హన్మంత్ రెడ్డి, బి.శ్రీనివాస్, వినోద్‌రాజ్, రాజేశ్వర్‌రెడ్డి వ్యవహరించారు.



ఎన్నికైన కార్యవర్గం

పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు అసంపూర్తిగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండటం బాధాకరమన్నారు. వెంటనే డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ద్వారా కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి తీసుకెళ్లి పాఠశాలలో వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సిరిపురం నాగేష్, బిట్లింగ్ రజనీకాంత్, సిరాజుద్దీన్, రవి, అస్గర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

నిర్మల్‌టౌన్: తెలంగాణ జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్ కరాటే శాఖలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ తేజింద్ర సింగ్ భాటియా తెలిపారు. గ్రేడింగ్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన 100 మంది విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, అమ్ముల భూషణ్, కరాటే మాస్టర్లు చిరంజీవి, నరేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిని సందర్శించిన బృందంతో వైద్యులు, సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం కాయకల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులు ఉండే వార్డులు, డయాలసిస్ కేంద్రం తదితర గదులను పరిశీలించారు. ఆసుపత్రి డైట్ మెనూతోపాటు శానిటేషన్ నిర్వహణ, ఆరోగ్యశ్రీ సేవలను తనిఖీ చేశారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు బృందం సభ్యులు శ్రీనివాస్, దీక్షిత్ పేర్కొన్నారు. వారి వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.